నేడు మతాంతర వివాహితులకు సన్మానం

నిజాంపేట్: నగరంలోని ఇందిర పార్కు వద్ద శుక్రవారం కులాంతర, మతాంతర వివాహితుల మేళా నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా నాయకుడు బాలపీరు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే కార్యక్రమంలో కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న నూతన దంపతనులు సన్మానించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు ఎండీ వాహీద్, తెలంగాణ హైకోర్ట్ జస్టిస్ గురిజాల రాధారాణి, పీసీసీ స్పోక్ పర్సన్ అద్దంకి దయాకర్ తదితరులు హాజరు కానున్నారని తెలిపారు.

దారి మళ్లింపు

సుభాష్‌నగర్: జీడిమెట్ల డివిజన్ పైపులైన్ రోడ్డులోని ఫాక్స్ సాగర్ కట్టు కాలువ, ప్రధాన మంచినీటి పైపులైన్ల పనులు జరుగుతున్న నేపథ్యంలో అటుగా రాకపోకలు నిలిపి వేస్తూ దారిని మూసివేశారు. షాపూర్‌నగర్ నుంచి 44వ జాతీయ రహదారికి వచ్చే వాహనాలను జీడిమెట్ల విలేజ్, ప్రాగా టూల్స్ దండమూడి ఎంక్లేవ్‌కాలనీ మీదుగా దారి మళ్లించారు. పది రోజుల పాటు ఈ పనులు కొనసాగనున్నాయి.

28న రక్తదాన శిబిరం

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని బతుకమ్మ ఘాట్‌లో ప్రగతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సౌజన్యంతో ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని నిర్వాహకులు కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 87909 84853, 63094 19482లో సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్సీకి వినతి

కుత్బుల్లాపూర్: శాసన మండలి వేదికగా ప్రజా సమస్యలను లేవనెత్తుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసి తమ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని రాజు హామీ ఇచ్చారు.

జగద్గిరిగుట్ట డివిజన్ అభివృద్ధి పనులు పూర్తిచేస్తాం

కుత్బుల్లాపూర్: తనపై నమ్మకంతో ఇంతటి అఖండ విజయాన్ని అందించిన ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ దేవమ్మబస్తీ, సంజయ్‌పురి కాలనీ, జగద్గిరినగర్, బీరప్పనగర్ ప్రాంతాల్లో కృతజ్ఞత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్థానికంగా మిగిలిన అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ యాత్ర చేపట్టానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.జగన్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు కృష్ణగౌడ్, సయ్యద్ రషీద్, సురేశ్, తేరాల శ్రీనివాస్, వీరాచారి, మల్లేశ్‌గౌడ్, ప్రవిణ్‌గుప్తా, ఇందిరాగౌడ్, సుజాత, వేణుయాదవ్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలి

దుండిగల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన వివిధ పథకాలు ప్రజలకు చేరే విధంగా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. ప్రధాని మోదీ తలపెట్టిన వికసిత్ భారత్ కార్యక్రమాన్ని దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాలను వివరించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ... ప్రధాని మోదీ ఎన్నో జనాకర్షణ పథకాలను ప్రవేశపెడుతున్నా క్షేత్రస్థాయిలో ప్రచారం చేయలేకపోతున్నామని అన్నారు. ఇప్పటి నుంచి నాయకులు, కార్యకర్తలు కేంద్ర పథకాలను ప్రజలకు వివరించి లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్, పీసరి కృష్ణారెడ్డి, గోనె మల్లారెడ్డి పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

నిజాంపేట్: నిజాంపేట్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం భండారి లేఅవుట్ రోడ్డు నం.9బీలోని పార్కులో పరిసర ప్రాంత వాచ్‌మెన్ల పిల్లలకు నోట్ పుస్తకాలు, స్టేషనరీని అందజేయనున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ కొంకి మళ్ల చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు జ్యోతి, బొర్రదేవిలు ముఖ్యఅతిథులుగా హాజరై పంపిణీ చేపట్టనున్నారు. ఉదయం 9గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి వాచ్‌మెన్‌లు తమ పిల్లలతో రావాలని నిర్వాహకులు కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని గండిమైసమ్మ దుండిగల్ మండల తహసీల్దార్ సుచరిత అన్నారు. మండల పరిధి మల్లంపేటలోని సర్వే నం.170, ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. సుచరిత ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ భారతీదేవి 13 ఇళ్లు, ఐదు బేస్‌మెంట్లను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మరోసారి నిర్మాణాలు చేపడితే ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేస్తామని సుచరిత హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఆదేశించారు.

దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతాం

దుండిగల్: దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని బీఆర్‌ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని కేవీఆర్ వ్యాలీలో రూ.52 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శంభీపూర్ కృష్ణ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించే దిశగా పని చేస్తున్నామన్నారు. అనంతరం వార్డులో పర్యటించి సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జీతయ్య, మాజీ ఉపసర్పంచ్ రాఘవేందర్‌గౌడ్, నాయులు ఇంద్రసేనా, శ్రీశైలంయాదవ్, మల్లేశ్ యాదవ్, కాలనీసభ్యులు పాల్గొన్నారు.

'నారాయణ'లో మాస్టర్ ఓరేటర్ కాంటెస్ట్

నిజాంపేట్: నిజాంపేట్‌లోని నారాయణ పాఠశాలలో గురువారం మాస్టర్ ఓరేటర్ కాంటెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థలకు చెందిన 4 బ్రాంచ్‌ల (1 - 5వ తరగతుల) 40మంది విద్యార్థులు ఈ కాంటెస్ట్‌లో పాల్గొన్నారు. వారికున్న భాషా పరిజ్ఞానాన్ని తమదైన శైలిలో వ్యక్తపరుస్తూ ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా నారాయణ పాఠశాల ఏజీఎం వైజయంతి, సాఫ్ట్‌స్కిల్స్ తెలంగాణ హెడ్ గీత మాట్లాడారు. భాష యొక్క ప్రాముఖ్యత, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్ స్కిల్స్ రీజినల్ హెడ్ యోగేంద్ర, ఆయా శాఖల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తారమ్మకు ప్రత్యేక పూజలు



సుభాష్‌నగర్: గాజులరామారంలోని చిత్తారమ్మ దేవి జాతరలో భాగంగా కుంకుమార్చనలు కొనసాగుతున్నాయి. గురువారం రోజు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలో జరిగిన కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఆలయ పరిసరాల్లో వెలిసిన రంగుల రాట్నాలు, దుకాణాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకం



కొంపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శ్రీహరి



సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ రాజ్యాంగ ప్రసాదించిన ఓటు హక్కును కలిగి ఉండాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు ఓటు హక్కును దుర్వినియోగం చేయమని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమన్నారు. ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటర్ల పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కుత్బుల్లాపూర్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ బీజేవైఎం ఆధ్వర్యంలో ఐడీపీఎల్‌లోని జై కన్వెన్షన్ హాల్‌లో 'నమో నవ్మత్‌దాతా'కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని ఓటర్లతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మీణ ప్రాంతాల్లోనే ఓటింగ్ శాతం అత్యధికంగా ఉంటుందని, ఉన్నత విద్యావంతులు ఓటింగ్‌కు దూరంగా ఉండటం బాధ కలిగించే విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయిరాం రెడ్డి, నాయకులు దయాకర్, వారాల మహేష్, జాల సందీప్, పత్తి సతీష్, రాజేశ్వరరావు, వేణుగౌడ్, ఈశ్వర్‌రెడ్డి, మనీష్, శ్యామ్‌కిరణ్‌రెడ్డి, తేజ, నాగ, అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు సామాన్యుడి హక్కు

చింతల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడు చేతిలో పాశుపతాస్త్రమని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గురువారం జిల్లా న్యాయ సేవధికార సంస్థ సీనియర్ పారా లీగల్ వలంటీర్, మేడ్చల్ జిల్లా ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ మధుబాబు చికిలె ఆధ్వర్యంలో గాజులరామారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని, విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య విలువలు తెలుసుకోవాలన్నారు. మధుబాబు చికిలే మాట్లాడుతూ.. అవగాహన, ఆలోచన అనేవి విద్యార్థి దశ నుంచే అలవారచుకోవాలన్నారు. మనకెందుకు అని కాకుండా నేను సైతం అనే భావనతో మెలగాలన్నారు. 1950 సంవత్సరం జనవరి 50న ఎన్నికల కమిషన్ ఏర్పడిందని తెలిపారు. నాటి నుంచి జాతీయ ఓటర్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ కుసుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రాంకీ సంస్థ ప్రతినిధులు

దుండిగల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తమ సంస్థ ఎల్లప్పుడు ముందుంటుందని రాంకీ ఫౌండేషన్ అండ్ రీసస్టైనబిలిటీ సీఈఓ మసూద్ మాలిక్ అన్నారు. దుండిగల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాలిక్ మాట్లాడుతూ.. పాఠశాలలోని ప్లాంట్ ఏర్పాటు వల్ల 800 మంది విద్యార్థులకు పరిశుద్ధమైన నీరు అందుతుందన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు సోలార్ లైట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ హెడ్ రవిశంకర్, హెచ్‌ఆర్ రాధాకృష్ణ సాయి, చక్రవర్తి, మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.ముత్యంగౌడ్, సత్య నళిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీల సంక్షేమానికి భారతి సిమెంట్స్ పెద్దపీట

భారతి సిమెంట్స్ టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్‌రెడ్డి



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లు, గిఫ్ట్‌లను అందజేస్తున్న సాత్విక్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: వ్యాపారంతో పాటు తాపీ మేస్త్రీల సంక్షేమానికి భారతి సిమెంట్స్ యాజమాన్యం పెద్దపీట వేస్తోందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్‌రెడ్డి అన్నారు. భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో 5స్టార్ గ్రేడ్ సిమెంట్‌ను కొత్తగా మార్కెట్‌లోకి విడుదల చేసిన నేపథ్యంలో గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దూలపల్లిలో జీఎంజే ట్రేడర్స్ వద్ద తాపీ మేస్త్రీలతో సమావేశమయ్యారు.

- ఈ సందర్భంగా సాత్విక్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర బ్రాండ్‌ల సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. శ్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు ఇది సరైన ఎంపిక అని అన్నారు. శ్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడవుతారని తెలియజేశారు. ఈ సందర్భంగా 40 మంది తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను, గిఫ్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ శ్రీనివాస్ టెక్నికల్ ఆఫీసర్ నరసింహులు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న..



వాహనదారుడితో మాట్లాడుతున్న అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

దుండిగల్: రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ట్రాఫిక్ పోలీసులు వినూత్న తరహాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వాహనదారుడి భద్రతే ముఖ్యంగా వారిలో చైతన్యం తీసుకువస్తున్నారు. ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ చౌరస్తాలో ప్రమాదాలు జరిగే తీరు తెన్నులు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మేడ్చల్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ వలంటీర్లు చౌరస్తాల్లో త్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేయొద్దంటూ వాహనదారులకు సూచించారు. వేగం కన్నా ప్రాణం మిన్న.. అని ఇంట్లో వారు తమ కోసం వేచి చూస్తారన్నారు. ఈ సందర్భంగా డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలన్నారు. రూల్స్‌కు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.